

క్లుప్తంగా

రెగ్యులరైజ్ చేయాలని వినతి



వర్ధన్నపేట : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను టీపీఎస్ఎఫ్ నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అరూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా అరూరి రమేష్ సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి రెగ్యులరైజ్ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు రఘు, కార్యదర్శి సదానందం, రామారావు, హనుమకొండ జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నర్సంపేట : నర్సంపేటలోని ద్వారకపేట వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏప్రిల్ 26నుంచి మే 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ అభివృద్ధికి, బ్రహ్మోత్సవ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బిట్స్‌లో పోస్టర్ల..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 27, 28, 29 తేదీల్లో శ్రేష్ఠ, స్పోర్ట్స్ డే, కల్చరల్, అనువల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. అనంతరం పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.

విగ్రహ ఏర్పాటుకు సాయం

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని సొంత ఖర్చుతో ఏర్పాటు చేస్తామని వైఎస్ ఎంపీపీ రడం భ్రావ్య, బీఆర్ఎస్ నాయకుడు భరత్ హామీ ఇచ్చారు. బుధవారం గ్రామానికి చెందిన యువసేన యూత్ సభ్యులు వారిని ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద కలిసి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. యువసేన యూత్ ప్రతినిధులు మంద కళ్యాణ్, యువరాజు, నాగరాజు, అనిల్, రమేశ్ పాల్గొన్నారు.


విద్యుత్ మీటర్లు బిగించుకోవాలి

వరంగల్ (పర్వతగిరి) : ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ మీటర్లు బిగించుకోవాలని విద్యుత్ డీఈ భిక్షపతి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎస్సీ, ఎస్టీలు తమ కుల సర్టిఫికెట్‌తో మీ సేవ కేంద్రాల్లో రూ.1,080డీడీ చెల్లించి మీటర్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

చెన్నారావుపేట : మండలంలోని జల్లీ నుంచి పాపయ్యపేట వరకు చేపట్టిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షుడు తండా రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాత రోడ్డును తొలగించి కంకరపోసి వదిలేశారని అన్నారు. దీంతో కంకర తేలి, దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రాత్రి వేళల్లో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులు ప్రారంభం



సంగెం : గ్రామంలోని కూలీలు ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలని సర్పంచ్ పోతుల ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో చెరువు పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు వడదెబ్బబారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ బోనాల కొమురయ్య, వార్డు సభ్యులు పసునూటి అశోక్, పూల రమేష్ నాయకులు జనగాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు కావాలి

పరకాల: పరకాల వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న 185 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేయాలని భారత ట్రేడ్ యూనియన్ నాయకుడు లంకదాసరి అశోక్ కోరారు. స్థానిక ఏఎంసీ చైర్మన్ బండి సారంగపాణికి బుధవారం మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

లక్కపురుగులతో పరేషాన్

- రాత్రిపూట ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

ఖానాపురం : పొద్దంతా పని చేసి ఇళ్లకు చేరిన ప్రజలకు ప్రశాంతత లేకుండా పోతుంది. రాత్రిపూట నిద్ర కూడా లేకుండా లక్క పురుగులు తిక్క తిక్క చేస్తున్నాయని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. గోదాంలతో రాత్రిపూట ఇళ్లలో ఉండలేకపోతున్నామని, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఖానాపురం మండల కేంద్రం శివారులో ఉన్న గోదాంలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సంవత్సరం ఇదే తంతు కొనసాగుతున్నప్పటికి గోదాం నిర్వాహకులు కనీసం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోదాంలకు సమీపంలో గుండ్లబజార్‌తో పాటు స్థానికుల ఇళ్లలోకి రాత్రి సమయంలో విరివిగా లక్కపురుగులు చేరుతున్నాయి. రాత్రి సమయంలో భోజనంలో, మనుషులపై చేరుతుండటంతో తిండి కూడా తినలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదాంలలోని లక్క పురుగులు ప్రజల ఇళ్లపైకి చేరకుండా చర్యలు చేపట్టాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోకపోవడంతో రోజురోజుకు లక్క పురుగుల బెడద ఎక్కువ అవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని లక్కపురుగుల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గుండ్ల బజార్‌లో ఇళ్లలోకి చేరిన లక్కపురుగులు



ఎవరూ పట్టించుకోవడంలేదు



రాత్రి సమయంలో లక్క పురుగులు ఇళ్లలోకి చేరుతున్నాయి. అన్నం, కూరల్లోనూ పురుగులు పడటంతో తినలేకపోతున్నాం. పడుకున్నప్పుడు కూడా ఒంటి పైకి చేరడంతో నిద్ర కూడా పట్టడంలేదు. లక్కపురుగుల బెడద నుంచి రక్షణ కల్పించాలి.

– తరాల శ్రీను, ఖానాపురం

కుటుంబ గొప్పతనాన్ని చాటిన ‘బలగం’

ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట : కుటుంబ గొప్పతనాన్ని, మానవ సంబంధాలను చాటి చెప్పిన గొప్ప చిత్రం బలగం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ఈగ రాజమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఈగ మల్లేశం ఆధ్వర్యంలో బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా కేతిరి సుధాకర్ రెడ్డి(కొమురయ్య పాత్రధారి), ప్రభాకర్(ఐలయ్య పాత్రధారి), వేముల ప్రభాకర్(పెద్ద మనిషి పాత్రధారి), బాబు(అంజన్న పాత్రధారి)లు హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన ఎమ్మెల్యే బలగం టీం సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బలగం సినిమాలో మానవ సంబంధాలను చాలా గొప్పగా చూపించారన్నారు. ఇంత మంచి సినిమా తీసిన బలగం యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. మరిన్ని ఇలాంటి గొప్ప సినిమాలు నిర్మించాలని ఆకాంక్షించారు. బలగం సినిమాకు అవార్డులు రావాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వామి రాయుడు, సుధీర్, అప్సర్, తుమ్మల రవీందర్, తూళ్ల కుమారస్వామి, పులి శ్రీనివాస్, కొండేటి శ్రీనివాస్, ఈగ దామోదర్, పాలకుర్తి సారంగపాణి, మార్త సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



బలగం సినిమాను యూనిట్ సభ్యులతో కలిసి వీక్షిస్తున్న ఎమ్మెల్యే రమేష్

మతవిద్వేషాలను రూపుమాపాలి



నర్సంపేట : మత విద్వేషాలను రూపుమాపి దేశంలో మైనార్టీల అభ్యున్నతికి ప్రార్థనలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఓ గార్డెన్‌లో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లింలు మత పెద్దలు సదర్‌సాబ్ ఎండి.నబి, మసీద్ కార్యదర్శి హబీబ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మసూద్‌ఖాన్, నాయకులు అయుంఖాన్‌లు మాధవరెడ్డి చేతికి దట్టీ కటి శాలువాతో సత్కరించి ప్రార్థనలు చేశారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



నర్సంపేట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న రజనికిషన్

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని రెండో వార్డులోని మినీ స్టేడియం ఆవరణలో బుధవారం స్థానిక కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్‌తో కలిసి రజనికిషన్ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆర్‌పీలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నారావుపేటలో..

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

చెన్నారావుపేట : కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానికులు వినియోగించుకోవాలని సర్పంచ్ ధరావత్ కిషన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని సూర్యపేట తండాలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్, ఆప్తాల్మిక్ శోభన్, మనోజ్, ఏఎన్ఎం లలిత, సూపర్‌వైజర్ వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

వైఎస్ విజయమ్మ జన్మదిన వేడుకలు

నర్సంపేట/నర్సంపేట రూరల్ : దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ జన్మదిన వేడుకలను బుధవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ మండల అధ్యక్షుడు నూనె నర్సయ్య, గిరిగాని చంద్రమౌళి, జిల్లా కమిటీ మెంబర్ కీసరి రాంబాబు, నర్సంపేట మండల యూత్ అధ్యక్షుడు జిల్లాపెల్లి దినేష్, నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జ్ గాండ్లోజు శివ, మానస, సరిత, లక్ష్మి, రజిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాలు

సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పని ప్రదేశాల్లో అధికారులు బుధవారం సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 10న సాక్షిలో నిలువ నీడేది? శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధిహామీ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బందితో చర్చించారు. పంచాయతీ పాలక వర్గం నీడ, తాగునీటి వసతి ఏర్పాటు చేయగా.. వైద్యసిబ్బంది మెడికల్ కిట్లను అందించారు. కాగా ఏపీఎం వెంకట్ నారాయణ రుద్రగూడెంలో చేపడుతున్న పని ప్రదేశాన్ని వైస్ ఎంపీపీ గందె శ్రీలత, సర్పంచ్ మల్లాడి కవితలతో కలిసి సందర్శించారు. పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేసి తాగునీటిని కూలీలకు అందించారు. వారి వెంట ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.



పని ప్రదేశంలో వసతులు కల్పిస్తున్న అధికారులు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

ఖానాపురం : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మచ్చిక సాంబలక్ష్మి ప్రమాదవశాత్తు మృతి చెందగా, రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కుటుంబాలు అధైర్యపడకుండా ఆసరాగా ఉండేందుకు పార్టీ తోడుగా నిలుస్తుందన్నారు. ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తకు సభ్యత్వాలు నమోదు చేయించి ఆపదలో ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, సొసైటీ వైస్ చైర్మన్ వేణుకృష్ణ, నాయకులు పూర్ణ, రమేష్, దాసరి రమేష్, అశోక్, జటంగి నాగరాజు, గంగాపురం రాజు, తదితరులు పాల్గొన్నారు.


భక్తుల సౌకర్యార్థం నీటి వసతి

దేవాలయాల వద్ద భక్తుల సౌకర్యానికి తాగునీటి వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని ధర్మరావుపేటలోని శివాలయం రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయాల వద్ద బోరు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల వద్ద తప్పకుండా నీటి వసతి అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

సీసీరోడ్డు పనులు ప్రారంభం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ కాట్ల కోమల ప్రారంభించారు. సర్పంచ్ పెండ్యాల మమతారాజు, ఎంపీటీసీ నాగరబోయిన మమతామోహన్, ఉప సర్పంచ్ జంగా రాజిరెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, సుకినె రాజేశ్వర్‌రావు, ధర్మారెడ్డి, కాట్ల భద్రయ్య, నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, ఆనంద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకే.. శిథిలావస్థకు

దుగ్గొండి : గ్రామాలలోని రైతులు సమావేశాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం క్లస్టర్‌కో రైతువేదిక నిర్మించింది. నిర్మాణ పనులు పూర్తి చేసి మూడేళ్లు గడవక ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దుగ్గొండి మండల కేంద్రంలోని రైతు వేదిక పైకప్పు రేకులు కొన్ని విరిగి పోవడంతో వర్షం పడకుండా టార్పాలిన్ పరదాలు ఏర్పాటు చేశారు. కాగా వ్యవసాయ అధికారులు పట్టింపులేకుండా వ్యవహరించడంపై అన్నదాతలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.




సభకు తరలిన ఎంసీపీఐ నాయకులు



నర్సంపేట: సభకు వెళ్తున్న నాయకులు

నర్సంపేట : రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన మహ్మద్‌గౌస్ స్తూపావిష్కరణ, ద్వితీయ వర్ధంతి సభకు నర్సంపేట పట్టణం నుంచి ఎంసీపీఐ(యు) నాయకులు తరలి వెళ్లారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ బుధవారం వాహనాల జెండాను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు జన్ను జమున, గజవెల్లి జగపతి, మల్లేష్, జన్ను క్రాంతి, రతన్, చొప్పరి పద్మ, మనమ్మ, బుచ్చయ్య, బిందు, స్వామి, అపర్ణ, స్వాతి, పద్మ, షబానా, హసీనా, జన్ను అనిల్, తదితరులు పాల్గొన్నారు.



సంగెంలో..

గౌస్ వర్ధంతి సభకు తరలిన శ్రేణులు

సంగెం : ఎంసీపీఐ ఆల్ ఇండియా కార్యదర్శి గౌస్ ద్వితీయ వర్ధంతి సభకు బుధవారం మండలంలోని పలు గ్రామాల నుంచి మండల కార్యదర్శి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కందికొండ కుమారస్వామి, గోనే రాంచందర్, సాంబయ్య, రవి, సురేష్, రేణుక, సంధ్య, స్వరూప తదితరులు ఉన్నారు.


చెన్నారావుపేట : మహ్మద్‌గౌస్ ద్వితీయ వర్ధంతి సభకు మండలంలోని ఎంసీపీఐ(యూ) నాయకులు కౌెట్టి సదానందం, రమేష్, శ్రీను, రవి బుధవారం తరలివెళ్లారు.

రేపటినుంచి చెక్కుల పంపిణీ

సంగెం : గతేడాది వడగళ్ల వానకు దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి, పండ్ల తోటలు, పంటలకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం చెక్కులను రేపటి నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ కళావతి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 403 మంది మొక్కజొన్న రైతులకు రూ 11,34,985లు, 166 మంది మిర్చి రైతులకు రూ 6,48, 135లు మొత్తం 569 మంది రైతులకు రూ 17,93,120లు మంజూరయ్యాయని అన్నారు. క్లస్టర్ల వారిగా ఈ నెల 21వ తేదీ శుక్రవారం రోజున మొండ్రాయి రైతువేదికలో ఉదయం 10గంటలకు 309 మంది రైతులకు, 24వ తేదీ సోమవారం సంగెం రైతువేదికలో 103 మంది రైతులకు, 26వ తేది బుధవారం కాపులకనిపర్తి గ్రామపంచాయతీలో 78 మంది రైతులకు, 28వ తేదీన గవిచర్ల, తీగరాజుపల్లి రైతు వేదికల్లో 79 మంది రైతులకు చెక్కులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఏఓ యాకయ్య, ఏఈఓలు రాజేందర్, సాగర్, సమత, గీత, భారతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తికి గాయాలు




ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని అయోధ్యనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సంపేట పట్టణంలోని రాంనగర్‌కు చెందిన తాటికొండ సచిన్‌టెండుల్కర్ పనుల నిమిత్తం అశోక్‌నగర్ వైపు వెళ్లాడు. పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై నర్సంపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో అయోధ్యనగర్ శివారులో ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



గీసుకొండ : ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వలో గీసుకొండ వద్ద బుధవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతురాలి వయస్సు సుమారు 55–60 సంవత్సరాల మధ్య ఉంటుందని, తెల్లని పూల డిజైన్‌తో ఎరుపు రంగు చీర ధరించి ఉంది. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే గీసుకొండ పోలీస్‌స్టేషన్ నంబర్ 87126 85031 ఫోన్ చేయాలని ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యకి మృతి




గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం సమీపంలోని మేల్ల(రంగనాయకుల)కుంట వద్ద అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. బుధవారం ఉదయం అతడి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గీసుకొండ ఎస్సై వెంకన్న సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుంటలోని నీరు ఎండిపోవడంతో బహిర్భూమికి వెళ్లిన అతడు అక్కడే పడిపోయి మృతిచెంది ఉంటాడని, లేదంటే గుండెపోటు వచ్చి మృతి చెందాడా? ఎవరైనా కొట్టడంతో చనిపోయాడా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అతని జేబులో లభ్యమైన ఆధార్‌కార్డు ప్రకారం మృతుడు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎల్ఐజీ–29 హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సిరువటి బడె స్వామిగా తెలుస్తోంది. మృతుడి తరఫున వారు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు..



నెక్కొండ : మండలంలోని గొల్లపెల్లి గ్రామ పరిధిలోని గేటుపల్లికి చెందిన మూడు వీరన్న(45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కాగా, వీరన్న మృతదేహంపై మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరన్న మృతి పార్టీకి తీరని లోటని, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మృతుడికి భార్య శాంతమ్మ, కుమార్తెలు పల్లవి, ప్రశాంతి, కుమారుడు విజయ్‌పాల్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రావుల హరీష్‌రెడ్డి, బక్కి అశోక్, రాచకొండ రఘు, బక్కి నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న చేను దగ్ధం



వరంగల్(పర్వతగిరి) : మండలంలోని ఏనుగల్లు గ్రామంలో బుధవారం విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పడి మొక్కజొన్న చేను దగ్ధమైంది. మండలంలోని తూర్పుతండాకు చెందిన బానోత్ కిషన్ మూడున్నర ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట వేశాడు. ఇందులో కొంత కంకి ఎండగా వారం రోజులుగా కూలీలతో కంకులను తెంపిస్తున్నాడు. బుధవారం కూడా కంకులను తెంపిస్తుండగా మధ్యాహ్నం హఠాత్తుగా కరెంటు స్తంభంపై నుంచి నిప్పు రవ్వలు పడి పంటకు మంట అంటుకుంది. దీంతో విరిసిన కంకులు కాలి అమ్ముకోవడానికి పనికి రాకుండా పోయాయి. చుట్టు పక్కల రైతులు వచ్చి మంటలను ఆర్పారు. ఎకరంన్నరకు పైగా మొక్కజొన్న చేను కాలిపోవడంతో కౌలు రైతు రూ.లక్షా 20వేల రూపాయలకు పైగా పంట నష్టపోయాడు. తను నాలుగు నెలలుగా పండించిన పంట బూడిద పాలు కావడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు కిషన్ కోరుతున్నాడు.


ఆవిర్భావ దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట : మార్క్సిస్టు మహోపాధ్యాయుడు రష్యన్ విప్లవ రథసారథి లెనిన్ జయంతి, సీపీఐ(ఎంఎల్) 54వ ఆవిర్భావ దినోత్సవాలను ఏప్రిల్ 22న అన్ని గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు చిర్ర సూరి, డివిజన్ కార్యదర్శి కోడెం సారంగం, అడ్డూరి రాజు, మనోహరచారి, అల్లం నారాయణ, రాజేందర్, జవహర్‌లాల్, చొప్పరి నర్సింహా, స్వామి, దార లింగన్న, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాపంథా నాయకులు

డ్వాక్రా సంఘం నాయకులకు సన్మానం



చెన్నారావుపేట : డ్వాక్రా సంఘం లీడర్లు, వీఓ నాయకులను చెన్నారావుపేట ఎస్‌బీఐ మేనేజర్ మనోజ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రసన్నకుమార్ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన పద్మావతి గ్రామైక్య సంఘం, విజయ భారతి ఎంపీఎస్ లీడర్లను, వీఓ లీడర్లను గుర్తించి అభినందించామన్నారు. కార్యక్రమంలో వీఓ అధ్యక్షులు గోపు మమత, ముంజ లక్ష్మి, హంస స్వప్న, యాట శ్రావణి, వీఓఏలు మేకల సుధా, కుసుమ ఆమని, మంగిశెట్టి మంజుల, మారెళ్ల కోమల, విజయభారతి సభ్యులు పాల్గొన్నారు.